

రంజాన్ మాసం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున ఆజంపురలోని టార్గెన్ గ్రౌండ్‌లో నిర్వహించిన దావత్ ఎ సహెరీలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పాల్గొన్నారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లో కాంగ్రెస్ మైనారిటీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మొహ్మద్ అలీ బాయ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు పట్నం రినేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్, గుల్షన్, రంజిత్, ఇమ్రాన్, నయీమ్ పాల్గొన్నారు. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి



సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని గడ్డిఅన్నారం కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ బద్దుల వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గడ్డిఅన్నారం డివిజన్ పార్టీ అధ్యక్షుడు బి.వేణుగోపాల్‌యాదవ్, చిట్టిబాబు, దామోదర్‌రెడ్డి, కృష్ణ, వేణుగోపాల్, కిరణ్, ఎండీ సయ్యద్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

అశోక్ దీక్ష భగ్నం.. ఉస్మానియాకు తరలింపు

చాదర్‌ఘాట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చైతన్యపురిలోని తన ఇంటి వద్ద నిరాహార దీక్ష చేస్తున్న అశోక్ అకాడమి నిర్వాహకుడు అశోక్‌ను చైతన్యపురి పోలీసులు మంగళవారం అర్ధరాత్రి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. దీక్ష చేస్తున్న అశోక్‌తోపాటు పలువురు నిరుద్యోగులను కూడా ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి పోలీసులు అశోక్ దీక్షను భగ్నం చేయగా తన ఇంటి వద్దే దీక్షను కొనసాగించారు. దీంతో చైతన్యపురి పోలీసులు మరో సారి దీక్ష భగ్నం చేస్తూ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మెగా డీఎస్‌సీ, టెట్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులతో సమావేశం నిర్వహించినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులతో సమావేశం నిర్వహించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అశోక్ డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న గ్రేటర్ యాదవ మహాసభ చైర్మన్ మహేందర్‌యాదవ్

పార్లమెంట్ ఎన్నికల్లో యాదవులకు 3 స్థానాలు కేటాయించాలి : మహేందర్‌యాదవ్

సంతోష్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి పార్టీ యాదవులకు 3 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ మహాసభ చైర్మన్ షైల్‌కోల్ మహేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం సైదాబాద్‌లో తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 శాతం ఉన్న యాదవులకు ప్రతి రాజకీయ పార్టీ అసెంబ్లీ స్థానాలను కేటాయించడం సంతోషం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కూడా పార్టీలు 3 స్థానాలను యాదవులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాణిక్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, రాజేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం - సమాలోచనపై సదస్సు

వనస్థలిపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి సౌజన్యంతో ఈనెల 15,16 తేదీల్లో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం-సమాలోచన అంశంపై నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని కార్యక్రమ నిర్వాహకులు, విద్యాభిమాని నక్క శ్రీనివాస్‌యాదవ్ వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వై.అశోక్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.జ్యోత్స్నప్రభ, డాక్టర్ సురేష్, చింతల రాకేష్ భవాని, శశిధర్, బీ.రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంస్థ డీఎఫ్‌వో కేసీ చౌదరి

ఎస్టీలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

చాదర్‌ఘాట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ ద్వారా ఎస్టీ విద్యార్థులకు స్టార్టప్ కంపెనీలను ఏర్పాటు చేసుకోవడానికి అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సంస్థ డీఎఫ్‌వో కేసీ చౌదరి అన్నారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో పారిశ్రామికవేత్తల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఎంఎస్‌ఎంఈ ఏజీఎం సునీత్ ఝా, బి.త్రీత, సుధీర్‌వర్మ, కళాశాల హెచ్‌ఆర్ డైరెక్టర్ జయప్రద, డైరెక్టర్ సాయిరాం పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో రెడ్డి జేఏసీ మహిళా కమిటీ సభ్యులు

పోటీ ప్రపంచంలో మహిళలు రాణించడం అభినందనీయం

వనస్థలిపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభ సూచకమని తెలంగాణ రెడ్డి జేఏసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎం.నాగమణిరెడ్డి అన్నారు. నాగమణిరెడ్డి ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగమణిరెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ శక్తిని ప్రపంచానికి చాటడం అభినందనీయమన్నారు. మహిళా ప్రతినిధులు శ్రీలత, అన్నపూర్ణ, పద్మలత, రమణి, కరుణ, వాణి, రజిత, అరుణ, సమత, వరలక్ష్మి, మంజుల, మాధవి, పద్మ పాల్గొన్నారు.

మినీ ట్యాంక్ బండ్‌గా మారనున్న కుమ్మరికుంట..!



కుమ్మరికుంట చెరువు కట్టను బలోపేతం చేయడానికి స్టోన్ పిచ్చింగ్ రెబెట్‌మెంట్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

- రూ. కోటి వ్యయంతో వేగంగా అభివృద్ధి పనులు
- మరిన్ని నిధులతో సుందరీకరణ పనులు



చెరువు కట్ట పటిష్టంగా ఉండడానికి అమరుస్తున్న రాతి కట్టడం

హయత్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని జంట చెరువుల్లో ఒకటైన కుమ్మరికుంటను అభివృద్ధి చేయాలన్న స్థానికుల కల త్వరలో నెరవేరనుంది. కుమ్మరికుంటను అభివృద్ధి చేయాలని రెండు దశాబ్దాలుగా స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఎట్టకేలకు కుమ్మరికుంట అభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీ రూ. 98 లక్షలు మంజూరు చేసింది. అందులో భాగంగా రెండు నెలలుగా జీహెచ్‌ఎంసీ లేక్ ఏఈ సీహెచ్. నాగరాజు పర్యవేక్షణలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. రానున్న వర్షాకాలం లోపల పనులు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులు చేస్తున్నారు. కోటి రూపాయలతో సుమారు 600 మీటర్ల పొడవు ఉన్న కట్టను బలోపేతం చేయడం, చెరువు కట్టకు నీళ్ల చేరే వైపుకు రాళ్లు అతికించడం (స్టోన్ పిచ్చింగ్ రెబెట్‌మెంట్), కట్టపైన చెరువు వైపుకు మూడు పీట్ల ఎత్తు పిట్టగోడ(సేఫ్టీ రేలింగ్) నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తి అయితే చెరువు అందంగా మారే పరిస్థితి ఉంది.

మరిన్ని నిధులు కేటాయించాలి



సాహెబ్‌నగర్ - హయత్‌నగర్‌ను కలిపే కుమ్మరికుంట రోడ్డును మరింత అభివృద్ధి చేయాలి. చెరువు కట్ట కింది వైపు కూడా కట్టను పటిష్టం చేయాలి. సాయినగర్ నుంచి వచ్చే మార్గంలో, చెరువు అలుగు వద్ద వంతెన నిర్మించాలి. అందుకు అవసరమైన నిధులు జీహెచ్‌ఎంసీ కేటాయించాలి. కుమ్మరికుంట కట్టను విస్తరించి సుందరీకరణ పనులు చేపట్టాలి.

- కళ్లెం నవజీవన్‌రెడ్డి, కార్పొరేటర్, హయత్‌నగర్

పద్మావతి కాలనీ వైపు రోడ్డు నిర్మించండి



కుమ్మరికుంట అలుగు మొదలుకుని తెలంగాణ పద్మావతి కాలనీ ఎఫ్‌టీఎల్ అనుకుని హయత్‌నగర్ బస్ డిపో ప్రహరీ వరకు కట్ట నిర్మించి దానిపైన 25 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేయాలి. అక్కడే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. చెరువు నీటితో కాలనీ మునగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. దీని వల్ల ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరకుండా ఉంటుంది. ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన ఈ హామీని నిలబెట్టుకోవాలి.

- కట్టా అంజిరెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ పద్మావతి కాలనీ

సివరేజ్ డైవర్షన్‌కు ప్రత్యేక చర్యలు

సామనగర్ నుంచి కుమ్మరికుంట వరకు వర్షం నీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారా కొన్ని సార్లు మురుగునీరు వచ్చి కుమ్మరికుంటలో చేరుతుంది. దీంతో ఇబ్బంది కలుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. అందుకోసం ప్రత్యేకంగా సివరేజ్‌ను మళ్లించేందుకు ప్రత్యేక స్ట్రక్చర్ నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. కేవలం వర్షం నీటితోనే చెరువును నింపడానికి ప్రయత్నిస్తున్నాం. కుమ్మరికుంటకు ఉన్న తూమును కూడా బాగు చేయిస్తాం. వర్షాకాలం ప్రారంభం నాటికి చేపట్టిన పనులు పూర్తి చేస్తాం. చెరువు అంచున రోడ్డు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- సీహెచ్. నాగరాజు, ఏఈ(లేక్స్), జీహెచ్‌ఎంసీ

మురుగునీరు రాకుండా అరికట్టండి



కుమ్మరికుంటలోనికి పై కాలనీల నుంచి వస్తున్న మురుగునీరును అరికట్టండి. కుంటలోనికి చేరిన మురుగునీటి వల్ల తీవ్రమైన దుర్గంధవాసన వస్తుంది. సాయంత్రం అయిందంటే అక్కడ నిలిచి ఉండే పరిస్థితి లేదు. మురుగు వాసనతో పద్మావతి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలి.

- చెంచిరెడ్డి, శ్రీ పద్మావతి కాలనీ

మోదీ వల్లే భారత్‌కు రెడ్ కార్పెట్ వేస్తున్న ప్రపంచ దేశాలు

- బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్

మన్సూరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): దేశాన్ని అన్ని రంగాల్లో మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రపంచ దేశాలన్నీ మోదీకి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నాయని బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్- బండ్లగూడ రోడ్డులోని మహవీర్ హరిణ వనస్థలి పార్కులో మార్నింగ్ వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని వాకర్స్‌ను కోరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ మరోసారి మోదీ ప్రభుత్వమే రావాలని దేశమంతా కోరుకుంటుందని, రాష్ట్రంలోనూ మెజారిటీ సీట్లు బీజేపీయే గెలుచుకోబోతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి సురేందర్‌నాథ్‌యాదవ్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యకార్యకర్తలతో సమావేశం..

ఎల్బీనగర్ నియోజకవర్గ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ డిజిటల్ విప్లవాన్ని ప్రతి సామాన్యుడికి అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత మోదీదేనన్నారు. మూడో సారి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు తమ ఓటు హక్కుతో ఆశీర్వదించాలన్నారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, నర్సింహగుప్తా, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, నవజీవన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మార్నింగ్ వాకర్స్‌తో ఈటల రాజేందర్

కుంట్లూర్ పెద్ద చెరువు సర్వే

- చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ హద్దుల గుర్తింపు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి కలెక్టర్ ఆదేశాలతో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ పెద్దచెరువులో బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి నేతృత్వంలో ఇరిగేషన్ ఏఈ తస్వీన్ రజా, సర్వేయర్ జ్యోతి, పెద్దఅంబర్‌పేట్ డీఈఈ అశోక్‌కుమార్, డీఐ శశిధర్‌తో పాటు సిబ్బంది చెరువు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ రికార్డు ప్రకారం 67 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్లు తెలిపారు. డిజిటల్ సర్వే ద్వారా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి హద్దులను గుర్తించారు. దీంతో పాటు ఆక్రమణకు గురైన విస్తీర్ణాన్ని కూడా అధికారులు గుర్తిస్తున్నారు. సర్వే అనంతరం ఆక్రమణకు గురైనట్లు తేలితే దాన్ని స్వాధీనం చేసుకుని పకడ్బందీగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దును ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.



కుంట్లూర్ పెద్ద చెరువులో సర్వే చేస్తున్న అధికారులు

యాచకురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- భర్తే నిందితుడు

కొత్తపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్ సమీపంలో జరిగిన యాచకురాలు జ్యోతి(32)హత్య కేసును పోలీసులు ఛేదించారు. జ్యోతి భర్త తుసమ్మరి బసంత్‌సింగే(35) నిందితుడని విచారణలో తేలింది. ఎస్‌హెచ్‌ఓ ఎల్.రామాంజనేయులు, ఎస్‌ఐ దయాకర్‌రెడ్డిల కథనం ప్రకారం.. ఈ నెల 10న యాచకురాలు జ్యోతి దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. జ్యోతి, బసంత్ అల్కాపురి, చైతన్యపురి, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో తిరుగుతూ భిక్షాటన చేసేవారు. రాత్రి ఎక్కడ ఖాళీ జాగా ఉంటే అక్కడ నిద్రించేవారు. ఇద్దరూ మద్యానికి, మత్తు పదార్థాల సేవనానికి బానిసలయ్యారు. గతంలో ఓ ఆటో దొంగతనం, ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడం కేసుల్లో సరూర్‌నగర్ పోలీసులు అతడిని కటకటాల్లోకి పంపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత అతడు మళ్లీ జ్యోతితో కలిసి తిరగడం మొదలు పెట్టాడు. కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరగడంతో అతడికి మూత్రనాళ సమస్యలు తలెత్తాయి. ఈనెల 7న అతడు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స తీసుకుని వచ్చాడు. 10న అతడు, ఆమె మద్యం మత్తులో ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్ వద్ద ట్రాఫిక్ రిజిస్ట్రేషన్ కాంపౌండింగ్ పాత కార్యాలయం వద్ద నిద్రిస్తున్నారు. ఇంకెవరితోనో తిరుగుతున్నట్లు ఆమెపై అతడికి అనుమానం ఉండేది. దీంతో మద్యం మత్తులో అతడు అదే రోజు ఉదయం 5:30 గంటలకు కత్తితో ఆమె గొంతు కోసి కిరాతకంగా హత్యచేసి పరారయ్యాడు. మళ్లీ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స కోసం చేరినట్లు సమాచారం. అతడు ఆస్పత్రి నుంచి విడుదలై ఎల్బీనగర్‌కు వచ్చాడని తెలుసుకున్న పోలీసులు అతడిని బుధవారం అరెస్టు చేసి విచారణ అనంతరం రిమాండుకు తరలించారు.

కార్పొరేషన్ల ఏర్పాటు నిర్ణయంపై హర్షం

ఎల్బీనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు పట్ల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మాటనిలబెట్టుకున్నారని ఆయన అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నందుకు ఆయన ఆర్యవైశ్య సమాజం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

పద్మశాలీ సంఘం..

పద్మశాలీల సంక్షేమం, అభివృద్ధి కోసం పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, ఆర్‌కేపురం కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అన్నారు. పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ విప్ కుమార్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

త్వరలో లక్ష మందితో కృతజ్ఞత మహాసభ


చాదర్‌ఘాట్ : ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ త్వరలో లక్షమంది రెడ్డి బంధువులతో కృతజ్ఞత మహాసభ నిర్వహించాలని నిర్ణయించినట్లు రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కృతజ్ఞత మహాసభకు ముఖ్య అతిథిగా సీఎంని ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కొత్తపేట : స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చక స్వాములు జగదీష్, మహంకాళి రవి పంచామృతాభిషేకం, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. అష్టోత్తర శత నామార్చన, సింధూపూజ అనంతరం హనుమాన్‌చాలీసా, సుందరాకాండ పారాయణం చేశారు.

మహిళపై దాడి కేసులో నిందితులకు జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు : మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పీపీ గోపాల్ కథనం ప్రకారం 2019లో బాధితురాలు తన స్నేహితులతో కలిసి జల్‌పల్లి ట్యాంక్ వద్దకు వెళ్లగా అక్కడే ఉన్న నిందితులు హబీబ్ ఉస్మాన్, మొయిన్‌ఖాన్, మొహ్మద్ అజర్‌లు బాధితురాలి ఫొటో తీసి వారితో అసభ్యంగా ప్రవర్తించారు. ఎవరికైనా చెబితే అంతు చూస్తామని బెదిరించారు. దీంతో బాధితురాలు పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిందితులకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5,500లు జరిమానా విధించారు.



నిందితులు హబీబ్ ఉస్మాన్, మొయిన్‌ఖాన్, మొహ్మద్ అజర్

ముగిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

చంపాపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అనుపమానగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగిన చతుర్థ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయంలో ఉదయం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి దంపతులు, భక్తులు 108కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. మహాసుదర్శన సహిత లక్ష్మీనారాయణ మూలమంత్ర సహిత నారాయణ శ్రీ సూక్త భూసూక్త హోమంలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు భక్తులు అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సుజాతానాయక్‌కు సన్మానం

చంపాపేట : హస్తినాపురం సౌత్ కాలనీ నూతన అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పావని బుధవారం కాలనీ ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్‌ను కలిసి సన్మానించారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికైన మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పావనిని కార్పొరేటర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు ప్రకాష్, రాంప్రసాద్, ఎస్ఎన్‌రెడ్డి, శ్రీకృష్ణ, హనుమంతురావు, సుమతి పాల్గొన్నారు.



కార్పొరేటర్ సుజాతానాయక్‌ను కలిసిన మహేందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు

ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించి ప్రభుత్వ బడులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. మండలంలోని మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కాంటేకార్ రమేష్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు నూతన స్పోర్ట్స్ దుస్తులను ఎమ్మెల్యే అందజేశారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. రూ.2.50 లక్షల సొంత నిధులతో స్కూల్‌లో టాయ్‌లెట్ల నిర్మాణానికి కృషి చేసిన మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, ఎంపీటీసీ బాలమ్మ, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, టీపీసీసీ సెక్రెటరీ మధుసూదన్‌రెడ్డి, జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

- ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎస్‌హెచ్‌ఓ రామాంజనేయులు

కొత్తపేట : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎల్బీనగర్ ఏసీపీ ఏ.కృష్ణయ్య, ఎస్‌హెచ్‌ఓ ఎల్.రామాంజనేయులు రౌడీషీటర్లను హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఉన్న 12మంది రౌడీషీటర్లకు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ కృష్ణయ్య, ఎస్‌హెచ్‌ఓ రామాంజనేయులు

ఎస్టీపీల పనుల పరిశీలన

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు చేపడుతున్న ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా.. నాగోల్, అంబర్‌పేట్‌లో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఎండీ సుదర్శన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. మొదట నాగోల్ ఎస్టీపీ వెళ్లిన ఆయన.. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సివిల్ పనులు పూర్తి చేసి ఎలక్ట్రో మెకానిక్ యంత్రాల బిగింపు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అంబర్‌పేట ఎస్టీపీని పరిశీలించారు. కార్యక్రమంలో ఈడీ డా. ఎం. సత్యనారాయణ, డైరెక్టర్ శ్రీధర్‌బాబు, సుదర్శన్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బూర్గుల రామకృష్ణారావు సేవలు మరువలేనివి

ఓల్డ్‌మలక్‌పేట మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు సేవలు మరువలేనివని మలక్‌పేట కాంగ్రెస్ ఎబ్లాక్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం బూర్గుల రామకృష్ణారావు జయంతిని మలక్‌పేటలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రేటర్ ఓబీసీ చైర్మన్ చౌకి రవికుమార్, జి కృష్ణ, రాజు, రామారావు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

మన్సూరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ జోన్ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ 583వ జయంతి వేడుకలను బుధవారం ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం గౌరవాధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి, అధ్యక్షుడు తీగుళ్ల ఉపేందర్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి శ్రీనివాస్, రామనాథం పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో ఏబీవీపీ సంస్థ ఆధ్వర్యంలో బీజేపీ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్‌యాదవ్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతో పాటు పెన్ను, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో తులసి కృష్ణ, కిరణ్‌కుమార్, ఏబీవీపీ కార్యదర్శి ఎండీ సోహెల్, గూడెపు మధుగౌడ్ పాల్గొన్నారు.

వేసవి ఎండల నుంచి జీహెచ్‌ఎంసీ కార్మికులను కాపాడాలి : సీఐటీయూ

ఎల్బీనగర్ : జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న కార్మికులను వేసవిలో ఎండల నుంచి కాపాడాలని సీఐటీయూ నేతలు జీహెచ్‌ఎంసీని కోరారు. బుధవారం జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల ఉపకమిషనర్లను కలిసిన సీఐటీయూ నేతలు వినతిపత్రం సమర్పించారు. వేసవిలో జీహెచ్‌ఎంసీ కార్మికులు ఎండలకు వడ దెబ్బలకు గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల పని వేళల్లో మార్పులు చేయాలని ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు కోరారు. కార్మికుల ఆరోగ్యాలు కాపాడేందుకు ఉదయం 6గంటల నుంచి 12 గంటల లోపు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వారు జోనల్ కమిషనర్, ఉపకమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అలేటి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్లకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు